సాక్షి
ఖమ్మం
శుక్రవారం । 14 । ఫిబ్రవరి । 2025



- పెళ్లి విషయంలో యువత పరిణితి
- తల్లిదండ్రుల నిర్ణయమే ఫైనల్ అని వెల్లడి
- ప్రేమించినా అమ్మానాన్నను ఒప్పిస్తామని ధీమా

పెద్దల మాటకే జై!


ప్రేమ, ఆకర్షణో తెలియని వయస్సులో దగ్గరవడం.. ఆపై పెద్దల దృష్టికి తీసుకెళ్లి వారు అంగీకరిస్తే సరి.. లేకపోతే స్నేహితుల సాయంతో పెళ్లి చేసుకోవడం.. ఆతర్వాత ఒడిదొడుకులు ఎదుర్కొనే జంటలు కనిపిస్తున్నాయి. అయితే, ప్రస్తుత తరంలో భవిష్యత్‌పై స్పష్టమైన లక్ష్యాలు ఉండడం.. చదువు తర్వాత ఉద్యోగ సాధన.. ఆపై ఆర్థిక స్థిరత్వం తప్పనిసరిగా ఉండాలనే ధోరణి నానాటికీ పెరుగుతోంది. ఈక్రమంలోనే పెళ్లి విషయంలో పెద్దల మాటకే విలువ ఇస్తామని ఎక్కువ మంది చెబుతున్నారు. ఇందులో యువతులే కాక యువకులూ ఉండడం విశేషం. ఒకవేళ మనస్సులు కలిసి జీవితాంతం కలిసి ఉంటామనే నమ్మకం ఏర్పడి పెళ్లి చేసుకోవాలనుకున్నా పెద్దల అంగీకారం తప్పక తీసుకుంటామని అంటున్నారు. అయితే, ప్రేమ పెళ్లి విషయంలో యువతులతో పోలిస్తే యువకుల్లో కొంత ఎక్కువగా ఆసక్తి కనిపించింది. నేడు (శుక్రవారం) ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 'సాక్షి' ఆధ్వర్యాన చేపట్టిన సర్వేలో ఇదే వెల్లడైంది. – సాక్షి నెట్‌వర్క్

సర్వే సాగిందిలా...

01) ప్రేమ పెళ్లి సరైనదేనా?
02) పెద్దలు కుదిర్చిన పెళ్లే మంచిదా?



అన్న ప్రశ్నలతో ఉమ్మడి జిల్లాలోని పది నియోజకవర్గాల్లో 'సాక్షి' బృందం గురువారం సర్వే నిర్వహించింది. నియోజకవర్గానికి 30మంది చొప్పున 300మందితో సర్వే సాగింది. ఇందులో 150మంది యువతులు, మరో 150 మంది యువకులు ఉన్నారు. బీఈడీ, ఫార్మసీ, ఇంజనీరింగ్, మెడికల్ కళాశాలతో పాటు లైబ్రరీల్లో ఉద్యోగాలకు సిద్ధమవుతున్న 25 నుంచి 30ఏళ్ల లోపు వారికి 'సాక్షి' బృందం ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టింది.



కొందరు యువతీ, యువకులు వెల్లడించిన అభిప్రాయాలు

- ✓ చదువుకునే సమయాన ఏర్పడే ఆకర్షణను ప్రేమగా భావించవద్దు. పెద్దల అనుమతి లేకుండా పెళ్లి చేసుకుంటే జీవితంలో సమస్యలను ఎదుర్కోవడంతో పాటు కుటుంబాలు చిన్నాభిన్నమవుతాయి.
- ✓ ప్రేమ పెళ్లి మంచిదే. కానీ జీవితంలో ఎదగాలంటే ప్రేమ పెళ్లయినా పెద్దల అనుమతితో జరగాలి. తద్వారా వైవాహిక జీవితం అద్భుతంగా ఉంటుంది.
- ✓ ప్రేమ వివాహంలో ఒకరినొకరు అర్థం చేసుకుంటూ సంతోషంగా గడపవచ్చు.
- ✓ పెద్దల మనసు గెలుచుకుని ప్రేమ వివాహాలు చేసుకున్న వారే జీవితంలో నిలబడగలిగారు. పెద్దల అండ లేకుంటే ప్రేమ పెళ్లి మంచిది కాదు.
- ✓ ప్రేమ పెళ్లిలోనే ఇద్దరి నడుమ అవగాహన ఎక్కువగా ఉంటుంది.
- ✓ పెద్దలు కుదిర్చిన పెళ్లిలో దంపతుల నడుమ అభిప్రాయ భేదాలు వచ్చినా సర్దిచెప్పడానికి, సరిచేయడానికి తల్లిదండ్రులు అండగా నిలుస్తారు. పెద్దలను ఎదిరించి పెళ్లి చేసుకుంటే సరైన తోడ్పాటు లేక ఇబ్బంది ఎదురవుతుంది.
- ✓ పెద్దలు కుదిర్చిన పెళ్లి చేసుకున్న ఎన్నో జంటలు సంతోషంగా ఉంటున్నాయి.
- ✓ ప్రేమించుకున్నా.. పెద్దల అనుమతితో వివాహం చేసుకున్న జంటలే సుఖంగా జీవిస్తున్నాయి. పెద్దల మాట వినడం మంచిది.
- ✓ పెద్దలు కుదిర్చిన పెళ్లి చేసుకున్నా అర్థం చేసుకునే పార్టనర్ దొరకకపోతే ఇబ్బందులు పడాలి. అర్థం చేసుకునే పార్టనర్ దొరికితే అది ఏ వివాహమైనా పెద్ద ఇబ్బందులేవీ ఉండవు.
- ✓ పెద్దల అనుభవం, వారి ముందుచూపుతో కుదిర్చిన వివాహాలే కలకాలం నిలుస్తాయి.

న్యూస్‌రీల్

శనివారం కూడా మిర్చి కొనుగోళ్లు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో వారాంతపు సెలవైన శనివారం (ఈనెల 15వ తేదీన) సైతం మిర్చి కొనుగోళ్లు నిర్వహిస్తామని ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.ప్రవీణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ బాధ్యులు లింగమంతుల జాతర సందర్భంగా సోమవారం సెలవు ఇవ్వాలని అభ్యర్థించారని పేర్కొన్నారు. ఈనేపథ్యాన రైతులు ఇబ్బంది పడకుండా శనివారం మిర్చి కొనుగోళ్లు చేపడుతామని, ఆదివారం సాధారణ సెలవుతో పాటు సోమవారం జాతర ఉంటుందని తెలిపారు. ఈ విషయాన్ని రైతులు గమనించాలని ఆయన కోరారు.

మూడెకరాల రైతులకూ 'భరోసా' జమ

ఖమ్మంవ్యవసాయం: పంటల సాగుకు పెట్టుబడి సాయంగా అమలుచేస్తున్న రైతు భరోసా పథకం ద్వారా రైతుల ఖాతాల్లో నగదు జమ అవుతోంది. మూడెకరాల మేర సాగు భూమి ఉన్న 43,212 మంది రైతుల ఖాతాల్లో ఎకరాకు రూ.6వేల చొప్పున రూ.50,17,09,542 గురువారం జమ చేశారు. జిల్లాలో 3,51,592 మంది రైతులకు రైతు భరోసా కింద రూ.371.06 కోట్లు మంజూరు కావాల్సి ఉంది. ఇందులో ఇప్పటివరకు 2,06,331 మంది రైతుల ఖాతాల్లో రూ.154,91,41,029 జమ అయ్యాయి.

బ్యాలెట్ పేపర్ల ముద్రణకు కొటేషన్ల స్వీకరణ

ఖమ్మంసహకారనగర్: ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిమిత్తం బ్యాలెట్ పేపర్ల ముద్రణకు ఆసక్తి ఉన్న ప్రింటింగ్ ప్రెస్‌ల యజమానులు ఈనెల 17 లోపు సీల్డ్ కొటేషన్లు సమర్పించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ ఒక ప్రకటనలో సూచించారు. ప్రెస్‌ల్లో రోజువారీ ముద్రణ సామర్థ్యం వివరాలతో జెడ్పీ సీఈఓ కార్యాలయంలో సీల్డ్ కొటేషన్లు అందించాలని తెలిపారు. అలాగే, ఈనెల 19న జిల్లా కొనుగోలు కమిటీ ఆధ్వర్యాన ముద్రణ ధరలు ఖరారు చేసే సమావేశానికి హాజరుకావాలని సూచించారు.

మిర్చి కొనుగోళ్లపై ఆర్‌జేడీ ఆరా



మిర్చి యార్డులో పరిశీలిస్తున్న ఆర్‌జేడీ, అధికారులు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌ను గురువారం మార్కెటింగ్ శాఖ వరంగల్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఉప్పల శ్రీనివాస్ సందర్శించారు. మార్కెట్‌కు భారీగా మిర్చి వస్తున్న నేపథ్యాన ఆయన క్రయవిక్రయాలు, ధరలు, కాంటాల వివరాలు ఆరా తీశారు. కొనుగోలు చేసిన మిర్చిని ఎప్పటికప్పుడు తరలించేలా ట్రాలీ వర్కర్స్ అసోసియేషన్ ప్రతినిధులకు సూచనలు చేశారు. మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.ప్రవీణ్‌కుమార్, గ్రేడ్–2 కార్యదర్శి వి.సుజన్‌బాబు, సహాయ కార్యదర్శి వీరాంజనేయులు ఉన్నారు.

ఆశలు ఆవిరైనట్లే..!

పరిషత్, పంచాయతీ ఎన్నికలు మరింత జాప్యం

- ఎప్పుడు నిర్వహిస్తారనే అంశంపై సందిగ్ధత
- 'వనరులు' సమకూర్చుకున్న ఆశావహుల్లో నైరాశ్యం
- ఒక్కసారిగా చల్లబడిన రాజకీయ వాతావరణం



సాక్షిప్రతినిధి, ఖమ్మం: జెడ్పీటీసీ, ఎంపీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికల బరిలో నిలవాలని భావించిన ఆశావహుల ఆశలు ఆవిరయ్యాయి. ఎప్పుడైనా నోటిఫికేషన్ రావొచ్చని ఎమ్మెల్యేలు సంకేతాలు ఇవ్వగా.. స్థానిక మాజీ ప్రజాప్రతినిధులు, నేతలతో సమావేశాలు నిర్వహించి దిశానిర్దేశం చేశారు. దీంతో నేడో, రేపో నోటిఫికేషన్ వస్తుందనే భావనతో పలువురు పోటీకి ఎమ్మెల్యేలను ఒప్పించే ప్రయత్నాలు చేస్తూనే ఆర్థిక వనరులు సమకూర్చుకుంటున్నారు. ఇంతలోనే ప్రభుత్వం మరోమారు కులగణన సర్వే, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధతపై ప్రకటన చేయడంతో ఎన్నికలు ఇప్పట్లో జరిగే అవకాశాలు కనిపించడం లేదు. దీంతో ఇన్నాళ్లు హైరానా పడిన ఆశావహుల్లో నైరాశ్యం అలుముకుంది.

ఒక్కో ప్రక్రియ ముగియడంతో..

గత ఏడాది ఫిబ్రవరి 2న గ్రామపంచాయతీల పాలకవర్గాల పదవీ కాలం ముగిసింది. ఆగస్టులో జిల్లా, మండల పరిషత్ పదవీ కాలం పూర్తయింది. ఆ తర్వాత ఇటు పంచాయతీలు, అటు పరిషత్‌లు ప్రత్యేక అధికారుల పాలన కిందకు వెళ్లాయి. అనంతరం ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం ఒక్కో ప్రక్రియను పూర్తి చేస్తోంది. ఈనెల 15 నాటికి షెడ్యూల్ వెలువడి వచ్చేనెల 15నాటికి పరిషత్, అటు పంచాయతీ ఎన్నికలు ముగిస్తారనే ప్రచారం జరిగింది. ఈ నేపథ్యాన అధికారులు ఓటర్ల జాబితాల రూపకల్పన, ఎన్నికల సామగ్రిని సమకూర్చుకోవడంతో పాటు ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇవ్వడంలో నిమగ్నమయ్యారు. ఇవన్నీ జరుగుతుండడంతో ఎన్నికలే తరువాయి అన్నట్లుగా ఆశావహులు హడావుడి చేయగా ప్రభుత్వ ప్రకటన వారిలో నీరసాన్ని నింపింది.

వేచి చూడాల్సిందే..

స్థానిక సంస్థల ఎన్నికలను వచ్చే నెల 15 లోగా ముగిస్తే ఆతర్వాత ఎస్సెస్సీ పరీక్షలకు ఇబ్బంది ఉండదని ప్రభుత్వం భావించినట్లు తెలుస్తోంది. అయితే మరోమారు కులగణన చేయాలని, బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలనే నిర్ణయంతో ఆశావహుల్లో నైరాశ్యం అలుముకుంది. బరిలో నిలుద్దామనుకుని ఇప్పటి వరకు వారు పడిన శ్రమ వృథా అయినట్లు భావిస్తున్నారు. ప్రభుత్వం చేసిన ప్రకటనతో ఇప్పట్లో ఎన్నికలు జరిగే పరిస్థితులు లేవని తెలుస్తోంది. దీంతో ఆశావహులు ఇంకా ఎన్నాళ్లు వేచిచూడాలా అన్న ప్రశ్న ఎదురవుతోంది. మరోపక్క స్థానికంగా ఉన్న అనుకూల పరిస్థితులను 'చే'జారకుండా చూసుకోవడం తమకు తలకు మించిన భారంగా మారుతుందని భావిస్తున్నారు.

రాజకీయ వేడి

స్థానిక పోరుకు అంతా సిద్ధమవుతున్న తరుణాన జిల్లాలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. పంచాయతీల్లో తాము మద్దతు ఇచ్చిన వారిని గెలిపించుకోవడం, పార్టీ గుర్తులతో నిర్వహించే పరిషత్ ఎన్నికల్లో బలనిరూపణ పార్టీల నేతలు సవాల్‌గా తీసుకున్నారు. జిల్లాలో 277 పంచాయతీలు, 20 జెడ్పీటీసీలు, 288 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. తొలుత పరిషత్, ఆతర్వాత జీపీ ఎన్నికలు జరుగుతాయనే ప్రచారం జరిగింది. ఈనేపథ్యాన జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో మెజార్టీ స్థానాలను దక్కించుకునేందుకు అధికార పార్టీ నాయకులు నియోజకవర్గ, మండల స్థాయి నేతలు, ఆశావహులతో సమీక్షలు నిర్వహించారు. ఎన్నికల షెడ్యూల్ ఎప్పుడైనా రావచ్చంటూ నేతలు, కేడర్‌కు దిశానిర్దేశం చేశారు. అధికార పార్టీకి తోడు మిగతా పార్టీల్లోనూ ఎన్నికలపై చర్చలు జోరుగా సాగాయి.

నిలిచి.. గెలవాలని

ఎన్నికల్లో బరిలో నిలవాలనుకున్న ఆశావహులు కావాల్సిన సరంజామా సిద్ధం చేసుకోవడంలో నిమగ్నమయ్యారు. పంచాయతీలో సర్పంచ్ లేదంటే ఎంపీటీసీ, జెడ్పీటీసీల స్థానాలకు పోటీకి దిగాలని భావించిన వారు ఎంత ఖర్చు చేయాలో నిర్ణయానికి వచ్చి వనరులు సమకూర్చుకున్నారు. అలాగే, స్థానికులతో మమేకం కావడం, యువత, ఓటర్ల మద్దతు కూడగట్టుకోవడంపై దృష్టి సారించారు. రిజర్వేషన్లు, గ్రామాల్లో రాజకీయ పరిస్థితులపై ఆరా తీస్తూనే మండల, గ్రామ స్థాయి ముఖ్య నేతలను మెప్పించే పనిలో పడ్డారు. ఇలా రాజకీయ వ్యూహాల్లో మునిగితేలుతున్న వారి ఆశలపై ఒక్కసారిగా నీళ్లు చల్లినట్లయింది.

అందరూ కులగణనలో పాల్గొనాలి..



మద్దులపల్లి మార్కెట్‌లో పరిశీలిస్తున్న మంత్రి శ్రీనివాసరెడ్డి

- రాష్ట్రంలో 3.12 శాతం మందే నమోదు చేసుకోలేదు
- తల తాకట్టు పెట్టయినా ఇళ్ల నిర్మాణం
- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కొణిజర్ల: రాష్ట్ర జనాభాలో 3.12 శాతం మంది మాత్రమే కుల గణనలో పేర్లు నమోదు చేయించుకోలేదని.. ఇందులో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, అనుచరగణం ఉందని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తిరిగి కుల గణన చేపడుతున్నందున కేసీఆర్ సహా అంతా తెలంగాణలోనే ఉన్నామని నిరూపించుకోవడానికై నా నమోదు చేయించుకోవాలని సూచించారు. కొణిజర్ల మండలం కొండవనమాలలో గురువారం ఆయన వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో చేపట్టిన కుల గణన దేశానికే రోల్ మోడల్‌గా మారనుందని తెలిపారు. కుల గణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఎన్నికలు జరిగే ప్రాంతాలు, ఉప ఎన్నికలు వచ్చే నియోజకవర్గాల్లో మాత్రమే ఇళ్లు, రేషన్ కార్డులు ఇచ్చారని, కేవలం ఇళ్ల బొమ్మలు చూపించి గత సీఎం గొప్పలు చెప్పుకున్నారు తప్ప పేదల కల నెరవేర్చలేదని ఆరోపించారు. అయితే, తమ ప్రభుత్వం మాత్రం తల తాకట్టు పెట్టయినా రానున్న నాలుగేళ్లలో 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తుందని, ఇల్లు లేని ప్రతీ పేదవాడి కల నెరవేర్చడమే లక్ష్యమని పొంగులేటి తెలిపారు. ఖరీఫ్ మాదిరిగానే యాసంగిలో కూడా రైతులు ఎన్ని లక్షల మెట్రిక్ టన్నుల సన్నధాన్యం పండించినా మద్దతు ధరతోపాటు రూ.500 బోనస్ చెల్లిస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మద్దులపల్లి మార్కెట్ సందర్శన

ఖమ్మంరూరల్: రూరల్ మండలం మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్‌ను రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం పరిశీలించారు. ఇటీవల నిర్మాణాలు పూర్తయిన మార్కెట్‌లో మిర్చి కొనుగోళ్లు జరుగుతుండగా పరిశీలించిన ఆయన మాట్లాడారు. రైతులకు ఇబ్బందులు ఎదురుకాకుండా క్రయవిక్రయాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. కాగా, మార్కెట్‌కు 55 బస్తాల మిర్చి అమ్మకానికి రాగా మహిళా రైతు నుంచి క్వింటాకు రూ.13,811 చొప్పున ధరతో కొనుగోలు చేశారు. ఈమేరకు మహిళా రైతును అధికారులు సన్మానించారు. మార్కెట్ చైర్మన్ హరినాథ్‌బాబు, డీఈ ఎల్లేష్, డైరెక్టర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా వ్యవహరిస్తే వేటు

- ప్రజలకు సేవ చేయాలంటేనే ఇక్కడ ఉండండి
- కేఎంసీ అధికారుల సమీక్షలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



సమీక్షిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పక్కన అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో ప్రజలకు, సమర్థవంతమైన పరిపాలనతో మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. కేఎంసీ కార్యకలాపాలపై కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం ఆయన అదనపు కలెక్టర్, ఇన్‌చార్జ్ కమిషనర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు సేవ చేసే భావన ఉంటేనే జిల్లాలో కొనసాగాలని, అలా కాదని ఇష్టారీతిన వ్యవహరిస్తే వేటు తప్పదని స్పష్టం చేశారు. పని కంటే తనకెవరూ ముఖ్యం కాదని తేల్చిచెప్పారు. కేఎంసీ పరిధిలో చెత్త పేరుకుపోతున్న 1,248 ఖాళీ స్థలాలను గుర్తించినందున నివేదిక ఇవ్వాలని, ప్రైవేట్ స్థలాలలో చెత్త తొలగించి మరోసారి చెత్త జమ కాకుండా సూచనలు చేయాలని తెలిపారు. అలాగే, ప్రతిరోజూ చెత్త సేకరించి డంపింగ్ యార్డ్‌కు తరలించేలా డివిజన్ల వారీగా ప్రణాళికలు సమర్పించాలని సూచించారు. వేసవి దృష్ట్యా తాగునీటి సరఫరాకు ఇబ్బందులు కలగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని తెలిపారు.

ప్రణాళికాయుతంగా ఆక్రమణల తొలగింపు

కార్పొరేషన్ పరిధిలో ఫుట్‌పాత్‌లపై ఆక్రమణల తొలగింపునకు ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ సూచించారు. షాపింగ్ మాళ్లు, వాణిజ్య సముదాయాల్లో దివ్యాంగుల సౌకర్యార్థం ర్యాంపుల నిర్మాణానికి నోటీసులు ఇవ్వాలని, అనుమతి లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటుచేసిన వారిపైనే కాక ప్రింట్ చేసిన షాపుల బాధ్యులకూ జరిమానా విధించాలని తెలిపారు. ట్రాఫిక్ సమస్య ఉన్న ప్రాంతాల్లో తీసుకోవాల్సిన చర్యలపై ట్రాఫిక్ పోలీసులతో సమన్వయం చేసుకోవాలన్నారు. వ్యాపారులకు వారం పాటు సర్దిచెప్పాలని, అయినా వినకపోతే నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం ఇన్‌చార్జ్ కమిషనర్ శ్రీజ మాట్లాడగా అసిస్టెంట్ కమిషనర్ అహ్మద్ షఫీ ఉల్లా, ఎస్‌ఈ వి.రంజిత్, ఈఈ కృష్ణాలాల్, ఏసీపీ వసుంధర, ఉద్యానవన అధికారి రాధిక, ఉద్యోగులు సాంబయ్య, జి.శ్రీనివాసరావు, రాజ్‌కుమార్, రవి, మహేందర్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఇల్లు కట్టాకే తొలగింపు

ఖమ్మం కాల్వొడ్డులో మున్నేరు పరీవాహక ప్రాంతమైన మంచికంటి నగర్, బొక్కలగడ్డలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో పర్యటించారు. పలు కాలనీల్లో కాలినడకన తిరుగుతూ పారిశుద్ధ్య నిర్వహణపై ఆరా తీయడమే కాక తాగునీరు, విద్యుత్, ఉపాధి పనుల వివరాలు తెలుసుకున్నారు. మున్నేటికి గతంలో మాదిరి వరద రాకుండా రిటైనింగ్ వాల్ నిర్మిస్తున్నందున, అడ్డుగా ఉన్న నిర్మాణాల తొలగింపు తప్పదని చెప్పారు. అయితే, బాధితులకు నూతన ఇళ్లు కట్టించాకే నిర్మాణాలు తొలగించనున్నందున ఆందోళన చెందొద్దని సూచించారు. తొలుత రేణుకా ఎల్లమ్మ తల్లి దేవస్థానం వద్ద సమ్మక్క – సారలమ్మ గద్దెలను దర్శించుకుని శివసత్తులతో మాట్లాడారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ షఫీ ఉల్లా పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలకు చెక్ పెట్టేలా..



సోలార్ బ్లింకింగ్ బారికేడ్లతో పోలీసులు

- వేగ నియంత్రణకు సోలార్ బ్లింకింగ్ బారికేడ్లు
- తనిఖీల కోసం ట్యాబ్‌లు, బ్రీత్ ఎనలైజర్లు

ఖమ్మంక్రైం: జిల్లాలో నానాటికీ పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల కట్టడికి పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా పోలీసు కమిషనర్ సునీల్‌దత్ ప్రతిపాదనల మేరకు ఉన్నతాధికారులు 150 సోలార్ బ్లింకింగ్ బారికేడ్లను కేటాయించారు. రద్దీ ప్రాంతాల్లో వీటిని వినియోగించనుండగా రాత్రివేళ కూడా వాహనదారులకు కనిపిస్తాయని, తద్వారా వేగనియంత్రణ సాధ్యమవుతుందని చెబుతున్నారు. అలాగే, డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు, వాహనాల వేగాన్ని కట్టడి చేసేలా చేపడుతున్న తనిఖీల్లో సాంకేతిక ఆధారాలు ఉండేలా ప్రతీ పోలీస్ స్టేషన్‌కు రెండు ట్యాబ్‌లు, పది డిజిటల్ కెమెరాలు, 27 బ్రీత్ ఎనలైజర్లు, రెండు స్పీడ్ లేజర్ గన్స్ కేటాయించారు. ఈసందర్భంగా సీపీ సునీల్‌దత్ గురువారం మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపే వారిని గుర్తించేలా నిరంతరం డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపడుతామని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించిన వారిని గుర్తించేందుకు గాను డిజిటల్ కెమెరాలు, స్పీడ్ లేజర్ గన్లు ఉపయోగించాలని ట్రాఫిక్ పోలీసులకు సూచించారు.

టీచర్ ఎమ్మెల్సీ బరిలో 19 మంది

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: వరంగల్ – ఖమ్మం – నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి నామినేషన్ల ఉపసంహరణ గడువు గురువారం ముగిసింది. ఈసందర్భంగా ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు ఉపసంహరించుకోవడంతో బరిలో 19 మంది మిగిలారు. ఇందులో ప్రధాన అభ్యర్థులుగా అలుగుబెల్లి నర్సిరెడ్డి, పులి సరోత్తంరెడ్డి, పింగిళి శ్రీపాల్‌రెడ్డి, పూల రవీందర్ తదితరులు ఉన్నారు. ఇప్పటికే ప్రచారంలో నిమగ్నమైన అభ్యర్థులు తమకు మద్దతు ఇస్తున్న సంఘాల అండతో మరింత జోరు పెంచేలా సన్నాహాలు చేసుకుంటున్నారు.

కొందరు ఎదిరించి, ఇంకొందరు ఒప్పించి ప్రేమ వివాహాలు

కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ జీవన ప్రయాణం

జీవితంలో స్థిరపడ్డాక నిర్ణయమే మేలంటూ సూచన

నేడు ప్రేమికుల దినోత్సవం

ప్రేమ మధురమైన అనుభూతి.. మాటలకు అందని భావం.. ఇలాంటివి చదవడానికి, వినడానికి బాగున్నా అనుభవంలోకి వచ్చేసరికి అందరికీ ఒకే రకమైన పరిస్థితులు ఎదురుకాకపోవచ్చు. ఆర్థిక స్తోమత, కులమతాలు, సామాజిక పరిస్థితులు ఇలా రకరకాల కారణాలతో ప్రేమను మధ్యలో వదులుకోవాల్సి వస్తోంది. అయినప్పటికీ పలువురు ప్రతికూల పరిస్థితులను అధిగమించి మరీ ప్రేమ వివాహాలు చేసుకున్నారు. ఇందులో కొందరు పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకుంటే, ఇంకొందరు పెళ్లి చేసుకున్నాక పెద్దలను ఒప్పించారు. నేడు (శుక్రవారం) ప్రేమికుల దినోత్సవం సందర్భంగా అలాంటి వారిలో కొందరి అనుభవాలు తెలుసుకుందాం..

కలిశారు... కలిసున్నారు

మూడేళ్లు కష్టపడి ఒప్పించి..



కుమార్తెతో సాయికుమార్ - స్వర్ణలత

కామేపల్లి: పాల్వంచకు చెందిన బొల్లెద్దు సాయి కుమార్, కొత్తగూడెంకు చెందిన స్వర్ణలతను కులాలు వేరైనా ప్రేమ బంధం కలిపింది. కొత్తగూడెంలో 2013లో సాయి ఎంబీఏ చదివే రోజుల్లో స్వర్ణలతతో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ఇద్దరి సామాజికవర్గాలు వేరు కావడం పెళ్లికి ఇరువైపులా పెద్దలు ఒప్పుకోలేదు. అయినా పట్టువిడకుండా మూడేళ్లకు ఇరువర్గాల కుటుంబాలను ఒప్పించి వారి చేతుల మీదుగానే 2016లో సంప్రదాయరీతిలో వివాహం చేసుకున్నారు. కుటుంబ సభ్యుల ప్రోత్సాహం, స్వర్ణలత సహకారంతో సాయికుమార్ ఎస్సై ఉద్యోగం సాధించి ప్రసుత్తం కామేపల్లిలో విధులు నిర్వర్తిస్తుండగా స్వర్ణలత గ్రూప్స్‌కు సిద్ధమవుతోంది. వీరికి ఒక కుమార్తె నిషిక ఉంది. అయితే, యువతీయువకులు తొందరపడి నిర్ణయాలు తీసుకోకుండా ఇరు కుటుంబాల అంగీకారంతోనే పెళ్లాడితేనే భద్రత ఉంటుందని చెబుతున్నారు సాయికుమార్–స్వర్ణలత.

ఆకర్షణ - ప్రేమకు తేడాను గుర్తిస్తేనే మేలు

• భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్



రాహుల్ - మనీషా

భద్రాచలం: ప్రేమించుకునే యువతీ, యువకులు జీవితంలో తమదైన రంగంలో స్థిరపడ్డాకే పెళ్లి ఆలోచన చేయాలని భద్రాచలం ఐటీడీఏ పీఓ బి.రాహుల్ చెబుతున్నారు. పెద్దలను ఒప్పించి ప్రేమ వివాహం చేసుకున్న రాహుల్ వెల్లడించిన వివరాలు ఆయన మాటల్లోనే... టీనేజీలో ఉండే సహజమైన ఆకర్షణను ప్రేమగా భావించొద్దు. ప్రేమించుకునే యువతీ యువకులు పరస్పర గౌరవం ఇచ్చుకున్నప్పుడు ఆ ప్రేమకు గౌరవం ఉంటుంది. రెండు కుటుంబాలను ఒప్పించి పెళ్లి చేసుకోవడం ద్వారా పెద్దలకు గౌరవం దక్కుతుంది. ప్రేమ పేరుతో విలువైన సమయాన్ని వృథా చేసుకోకుండా జీవితంలో స్థిరపడేందుకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రేమ పేరుతో పైశాచికత్వానికి పాల్పడే దృక్పథాన్ని యువత మార్చుకోవాలి. నారాయణపేట జిల్లా కేంద్రానికి చెందిన నాకు ప్రభుత్వ ఉపాధ్యాయురాలైన మనీషాతో బస్సులో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. తొలుత నేనే ప్రపోజ్ చేశా. కొద్ది కాలం గడిచాక ఆమె కూడా అంగీకరించడంతో జీవితం, భవిష్యత్‌పై పరస్పరం మాట్లాడుకున్నాం. ఆపై పెద్దలకు చెప్పి వారిని ఒప్పించి పెళ్లి చేసుకున్నాం. ఖమ్మంలో అదనపు కలెక్టర్‌గా పనిచేస్తున్న సమయాన మా వివాహం జరిగింది.

ఓయూ మమ్మల్ని కలిపింది..



కోమలి - విజయ్

ఖమ్మంమయూరిసెంటర్: ఉస్మానియా యూనివర్సిటీలో మొదలైన తమ పరిచయం ప్రేమగా మారి పెళ్లికి దారి తీసిందని ఖమ్మంలోని ఎస్సీ బాలికల కళాశాల వసతిగృహం (బీ) సంక్షేమ అధికారి కోమలి తెలిపారు. ఈ సందర్భంగా కోమలి వెల్లడించిన వివరాలు ఆమె మాటల్లోనే... ఓయూలో క్లాస్‌మేట్ అయిన యాదాద్రి భువనగిరి జిల్లా మురిపిరాలకు చెందిన విజయ్ తెలంగాణ సాధన, విద్యార్థుల సమస్యలపై పోరాడుతూ తెలంగాణ విద్యార్థి వేదిక రాష్ట్ర అధ్యక్షుడిగా, ఓయూ టీఎస్ జేఏసీ చైర్మన్‌గా కొనసాగాడు. బయ్యారానికి చెందిన మా అన్నయ్య ఎస్ఎఫ్ఐలో పనిచేయగా, తాత స్వాతంత్ర్య సమరయోధుడు. నాకు కూడా ఉద్యమంలో పూర్తిస్థాయిలో పాల్గొనాలని ఉన్నా ప్రభుత్వ ఉద్యోగం లక్ష్యంగా ఉండడం.. నేను చేయాలనుకున్న పనిని విజయ్ చేస్తున్నందుకు సంతోషించేదాన్ని. ఇద్దరి ఆలోచనలు కలవగా పెళ్లి ప్రస్తావన విజయ్ తీసుకొచ్చాడు. ఫుల్‌టైం ఆర్గనైజేషన్‌లోనే కొనసాగుతానని, గ్రామంలో పొలం ఉన్నందున వ్యవసాయం చేసైనా పోషిస్తానని చెప్పాడు. ఉద్యోగమే నా లక్ష్యం కావడంతో అప్పట్లో పెళ్లి ఆలోచన లేదని చెప్పినా విజయ్ అడిగిన విధానం, ఆయన నిజాయతీ నచ్చాయి. నాకు 2011లో సాంఘిక సంక్షేమ శాఖలో వసతిగృహం అధికారిగా ఉద్యోగం వచ్చింది. ఇంకో ఉద్యోగిని కాకుండా విజయ్‌ని పెళ్లాడితే సమాజానికి ఉపయోగపడతామని అనిపించడం.. ఇరుకుటుంబాల్లో కులాతీత సమాజాన్ని కోరుకుంటుండడంతో పెళ్లికి సులభంగానే ఒప్పుకున్నారు. 2011 డిసెంబర్ 18న ఓయూలో ఆదర్శ వివాహం చేసుకున్నాం. ఇప్పుడు మాకు ఇద్దరు పిల్లలు. ప్రేమ పెళ్లి అయినా, పెద్దలు కుదిర్చిన వివాహమైనా జీవితకాల ప్రయాణం కష్టనష్టాలు ఉంటాయని, ఘర్షణలను పెంచుకోకుండా, ఒకరిపై ఒకరు బాధ్యతగా కొనసాగితే జీవితం బాగుంటుందని, ముందుగా తెలుసుకుంటే ఏ ఇబ్బందీ ఉండదు.

పోలీసు శిక్షణ కేంద్రంలో చిగురించిన ప్రేమ



కుమారుడితో నాగుల్‌మీరా-షేక్ హసీనా

కొత్తగూడెం టౌన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎస్సైలు విధులుగా నిర్వర్తిస్తున్న షేక్ హసీనా, పఠాన్ నాగుల్‌మీరా మధ్య పోలీసు ట్రైనింగ్ సెంటర్‌లో చిగురించిన ప్రేమ పెళ్లిగా మారింది. హైదరాబాద్ ఎల్‌బీ.నగర్‌కు చెందిన షేక్ హసీనా ఇంజనీరింగ్ పూర్తిచేశాక 2019 ఎస్సైగా ఎంపికైంది. 2020లో పోలీసు అకాడమీలో శిక్షణకు వెళ్లింది. ఖమ్మం జిల్లా మధిర మండలం భీమవరానికి చెందిన పఠాన్ నాగుల్‌మీరా కూడా ఇంజనీరింగ్ పూర్తిచేయగా 2020లో ఎస్సై శిక్షణకు వెళ్లాడు. అక్కడే ఇద్దరి మధ్య స్నేహం మొదలైప్రేమగా మారగా కుటుంబానికి చెప్పారు. హసీనా తరఫు వారు సమయం తీసుకోగా ఎవరికి వారి పెద్దలకు ప్రేమను వివరించడంతో ఎట్టకేలకు ఒప్పుకున్నారని తెలిపారు. ప్రస్తుతం హసీనా కొత్తగూడెం ఐటీ వింగ్‌లో, నాగుల్‌మీరా ఇల్లెందులో ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్నారు. వీరికి ప్రస్తుతం కుమారుడు అర్హాన్‌ఖాన్ ఉన్నాడు. ఇద్దరు విధులకు వెళ్లాల్సి రావడంతో పెద్దలు చేయూతగా నిలుస్తున్నారని చెప్పిన నాగుల్‌మీరా.. ఇంట్లో పనులన్నీ హసీనా చేస్తుందని.. అడపదడపా తాను సాయం చేస్తానని చెప్పారు. ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూనే బాబు పెంపకంలో శ్రద్ధ వహిస్తున్నామని వెల్లడించారు.

కష్టాలను మరిచి.. కంటికి రెప్పలా ప్రేమిస్తూ..



పృథ్వీ - స్పందన

వైరా: ఇద్దరి కులాలు ఒక్కటే అయినా.. ఒకరి తల్లిదండ్రులు ప్రేమను అంగీకరించకపోయినా.. ఒక్కటైన ఆ జంట జీవనం సాగిస్తోంది. వైరాకు చెందిన జినుగు పృథ్వీ, బిల్లా స్పందనది ఒకే కులం. తొమ్మిదేళ్ల ప్రేమించుకోగా యువతి తల్లిదండ్రులు ప్రేమను అంగీకరించలేదు. మరోపక్క పృథ్వీ తల్లిదండ్రులు అంగీకరించడం, ఇద్దరూ మేజర్లు కావడంతో 2023 జూన్‌లో వివాహం చేసుకున్నారు. స్పందన గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి గ్రూప్స్ పరీక్షలు రాయగా ఫలితాల కోసం ఎదురుచూస్తోంది. పృథ్వీ ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ భార్యను కంటికి రెప్పలా చూసుకుంటున్నాడు. ఈ తరం యువతీయువకులకు ప్రేమ, ఆకర్షణ మధ్య తేడాను గుర్తించాలని.. ప్రేమిస్తే ఎంత కష్టమైనా ఎదుర్కొని ముందుకు సాగాలని చెబుతున్నారు.

ఎల్లలు దాటిన ప్రేమబంధం



లావణ్య-మార్క్‌మాన్‌పిల్లా

సత్తుపల్లిటౌన్: కులమతాలు కాదు ఏకంగా దేశాలు వేరైనా మనస్సులు కలవడంతో ఈ జంట పెళ్లి బంధంతో ఒక్కటైంది. సత్తుపల్లికి చెందిన లావణ్య ఐదేళ్లుగా స్పెయిన్‌లోని బార్సిలోనాలో ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ రంగంలో ఉద్యోగిగా పనిచేస్తోంది. ఆమెకు అక్కడే స్పెయిన్ దేశానికి చెందిన మార్క్‌మన్‌పిల్లాతో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. వీరి ప్రేమను ఇరువైపులా పెద్దలు అంగీకరించడంతో గతేడాది ఏప్రిల్ 3వ తేదీన సత్తుపల్లిలో వివాహ బంధంతో ఒకటయ్యారు. ప్రస్తుతం స్పెయిన్ దేశంలోనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా ఆనందంగా జీవనం సాగిస్తున్నారు. ఎలాంటి అరమరికలు లేకుండా ఒకరికొకరు అర్థం చేసుకొని జీవితంలో స్థిరపడి పెద్దలను ఒప్పించగలిగితే ఆ ప్రేమ నిలుస్తుందని చెబుతున్నారు. కష్టసుఖాలలో కలిసి ఉండటమే నిజమైన ప్రేమ అని వారు పేర్కొంటున్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

సత్తుపల్లిటౌన్/ఖమ్మం సహకారనగర్: ఈ–కుబేర్‌లో పెండింగ్ ఉన్న ఉపాధ్యాయుల బిల్లులు వెంటనే చెల్లించాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి కోరారు. సత్తుపల్లిలో గురువారం పర్యటించిన ఆయన మరోమారు ఎమ్మెల్సీగా తనను గెలిపించాలని ఉపాధ్యాయులను కోరారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ మెడికల్, పెన్షన్ బిల్లులు, ఉద్యోగ విరమణ బెనిఫిట్లు, కేజీబీవీ ఉపాధ్యాయుల సమ్మెకాలపు జీతం బిల్లులు విడుదల చేయాలని, గురుకులాల వేళలు మార్చి కేర్ టేకర్లను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు. కాగా, ఎమ్మెల్సీ ఎన్నికల్లో నర్సిరెడ్డిని గెలిపించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విజయ్, మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మనోహర్‌రాజు కోరారు. ఖమ్మంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యమ నాయకుడైన నర్సిరెడ్డి ఆరేళ్లుగా సమస్యలను శాసనమండలిలో ప్రస్తావించి పరిష్కారానికి పాటుపడ్డారని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏ.వీ.నాగేశ్వరరావు, వెంగళరావుతో పాటు ఎం.నాగిరెడ్డి, శ్యాంసుందర్, వెంకటేశ్వరరావు, నాగేశ్వరావు, సంధ్యారాణి ఉమాదేవి, పాషా పాల్గొన్నారు.

అన్నం ఆశ్రమానికి రూ.5లక్షల విలువైన బియ్యం, సామగ్రి



బాధ్యులకు సామగ్రి అందిస్తున్న జడ్జి చంద్రశేఖర్

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని అన్నం సేవా ఫౌండేషన్ ఆధ్వర్యాన కొనసాగుతున్న ఆశ్రమానికి హైదరాబాద్‌కు చెందిన రిలయబుల్ ట్రస్ట్ బాధ్యులు గురువారం రూ.5లక్షల విలువైన బియ్యం, ఇతర సామగ్రి అందజేశారు. ఈ సామగ్రిని జిల్లాన్యాయ సేవాధికారిక సంస్థ కార్యదర్శి చంద్రశేఖరరావు చేతుల మీదుగా అందించగా ట్రస్ట్ చైర్మన్ రవి తదితరులు పాల్గొన్నారు. కాగా, అన్నం సేవా ఆశ్రమంలో ఉంటున్న వారికి మధురానగర్‌లోని శ్రీ సద్గురు సాయినాథ మందిరం కమిటీ ఆధ్వర్యాన అన్నదానం ఏర్పాటు చేయగా జడ్జి చంద్రశేఖరరావు ప్రారంభించారు. ఆలయ బాధ్యులు టీ.వీ. పుల్లంరాజు, అలవాల రామనాథం, రుద్రోజు పరిపూర్ణాచారి, కుందూరు జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓట్ల తొలగింపుపై హైకోర్టుకు..

నేలకొండపల్లి: స్థానికంగా ఉండడం పలువురి ఓట్లను తొలగించాలని ఇరువర్గాలు పోటీ పడి అధికారులకు ఫిర్యాదు చేయగా, ఈ వ్యవహారంపై కొందరు హైకోర్టును ఆశ్రయించారు. మండలంలోని ముజ్జుగూడెం, తిరుమలాపురం తండాకు చెందిన కొందరి ఓట్లు తొలగించాలని రెండు వర్గాల వారు ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్ జె.మాణిక్‌రావు మూడు రోజులుగా విచారిస్తుండగా ముజ్జుగూడెంకు 81 మంది గురువారం హైకోర్టును ఆశ్రయించారు. అధికారులు తమ ఓటు హక్కును తొలిగించేందుకు ప్రయత్నిస్తున్నారని పిటీషన్ దాఖలు చేయగా పూర్తి వివరాలు సమర్పించాలని తహసీల్దార్‌ను హైకోర్టు ఆదేశించింది. కాగా, విచారణ కొనసాగుతుండగానే తిరుమలాపురానికి చెందిన ఓటర్ల విషయంలో దరఖాస్తులను ఉపసంహరించుకోవడంతో వివాదం ముగిసింది.

అదుపు తప్పి కారు బోల్తా, వ్యక్తి మృతి



సాయి (ఫైల్)

కారేపల్లి/ఇల్లెందు: అదుపు తప్పి కారు బోల్తా పడడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కారేపల్లి మండలం శాంతినగర్ సమీపాన గురువారం చోటు చేసుకుంది. ఇల్లెందుకు చెందిన డేరంగుల సాయి(30) హైదరాబాద్‌లో ఉంటుండగా, బంధువుల పెళ్లికి హాజరయ్యేందుకు కారులో బయలుదేరాడు. మార్గమధ్యలో కారేపల్లి క్రాస్ వద్ద సాయి స్నేహితులైన ఇల్లెందు వాసులు కళ్యాణ్‌లోథ్, కార్తీక్ లోథ్ కూడా కారు ఎక్కారు. ఈక్రమంలో శాంతినగర్ సమీపాన అడ్డొచ్చిన కుక్కలను తప్పించే క్రమాన కారు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన సాయిని స్థానికులు ఇల్లెందు ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా మృతి చెందాడు. సాయి తండ్రి డేరంగుల పోశం బీఆర్ఎస్ నాయకుడు కాగా, ఆయనకు భార్య కావ్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనలో మరో ఇద్దరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కాగా, పోశంను బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు.

తిరుమలాయపాలెం ఐకేపీలో అక్రమాలు

గతంలో పనిచేసిన నలుగురి సస్పెన్షన్

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం మండల పరిధిలో ఇందిరాక్రాంతి పథకంలో అక్రమాలు వెలుగుచూడడంతో నలుగురు ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ అదనపు కలెక్టర్ శ్రీజ ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలోని బీరోలు గ్రామదీపికను ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ సీఈఓగా నియమించి రెండు పదవులకు వేతనాలు చెల్లిస్తుండడం, ఎదుళ్లచెరువులో ఏపీఎం బంధువు ఖాతాకు రూ.2లక్షలు జమ చేయడం, హైదర్‌సాయిపేటలోని బాలాజీ గ్రామ సమాఖ్యకు రూ.2.50లక్షలు చెల్లించడం, బీరోలులో సీహెచ్‌సీ సెంటర్ ద్వారా ట్రాక్టర్ కొనుగోలు చేసినా లాభాలు జమ చేయకపోవడమే కాక బీరోలు ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వహణలో అక్రమాలు జరిగినట్లు గుర్తించారు. దీంతో విచారణ చేపట్టగా మండలంలో విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్లిన ఏపీఎం అలివేలుమంగ, సీసీలు దేవసుందరం, జైపాల్, రేణుకను సస్పెండ్ చేస్తూ అదనపు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఆటోను ఢీకొట్టిన ట్రాక్టర్, ఒకరు...



మురళి (ఫైల్)

పెనుబల్లి: కూలీలతో వెళ్తున్న ఆటోను ట్రాక్టర్ ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్రగాయాలైన ఘటన మండలంలోని నాయకులగూడెంలో గురువారం చోటు చేసుకుంది. మండలంలోని కందిమళ్లవారి బంజర్‌కు చెందిన తొమ్మిది మంది మహిళా కూలీలు, ముగ్గురు పురుషులు మొక్కజొన్న పిలకలు తొలగించేందుకు గురువారం ఉదయం ఆటోలో చంద్రుగొండ బయలుదేరారు. నాయకులగూడెం వద్ద కంకర లోడుతో వస్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి వీరి ఆటోను ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన సమయాన ఆటోలో డ్రైవర్ సహా 14 మంది ఉండగా, వీరంతా రోడ్డుపై పడిపోయారు. ఇందులో తుమ్మలపల్లి మురళి, బత్తుల వెంకమ్మ, కంపా మారమ్మకు తీవ్ర గాయాలు కాగా 108లో పెనుబల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ మురళి(28) మృతి చెందాడు. ఈమేరకు క్షతగాత్రులను కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ పరామర్శించారు.

గంజాయితో సహా ఇద్దరి అరెస్ట్

ఖమ్మంక్రైం: గంజాయి అమ్ముతున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఖమ్మం త్రీటౌన్ సీఐ రమేష్ వెల్లడించారు. నగరంలో గురువారం చేపట్టిన తనిఖీల్లో అనుమానాస్పదంగా కనిపించిన ఖమ్మం రూరల్ మండలం కస్నాతండాకు చెందిన వాంకుడోతు వినోద్‌ను అదుపులోకి తీసుకోగా గంజాయి లభ్యమైంది. కొన్నాళ్లుగా హైదరాబాద్‌లో ఉంటున్న ఆయన అక్కడ పరిచయమైన గణేష్‌తో కలిసి ఏపీకి వెళ్లి గంజాయి కొనుగోలు చేసి తీసుకొచ్చాడు. ఆపై 500గ్రాముల గంజాయితో ఖమ్మం వచ్చిన వినోద్ చిన్న పొట్లాలుగా చేసి విక్రయిస్తున్నాడు. ఈక్రమంలోనే వినోద్‌తో పాటు గంజాయి కొనుగోలుకు వచ్చిన శ్రీనివాస్‌నగర్ వాసి తుడం రాముని అదుపులోకి తీసుకుని, 200 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. ఇదే కేసులో గణేష్‌తోపాటు ఖమ్మంకు చెందిన భవానీప్రసాద్, సాయిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

మనస్తాపంతో బలవన్మరణం

కల్లూరు: కల్లూరులోని హోటల్‌లో పని చేస్తున్న ఖాన్‌ఖాన్‌పేటకు చెందిన బెజవాడ శ్రీను(26) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు పెళ్లి ఖాయం కాకపోవడం, సహచరులందరికీ వివాహాలు అవుతుండడంతో మనోవేదనకు గురైన శ్రీను మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలోనే జీవితంపై విరక్తితో బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయాన ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఘటనపై ఆయన సోదరి ఫిర్యాదుతో గురువారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పోలీసులకు సవాల్‌గా మారిన చోరీ

వైరా ఘటనపై విచారణకు ప్రత్యేక బృందాలు

వైరా: వైరాలోని సుందరయ్య నగర్‌లో బుధవారం పట్టపగలు సర్వే పేరిట వచ్చిన నలుగురు ఓ వృద్ధురాలిని కట్టి పడేసి భారీగా ఆభరణాలు ఎత్తుకెళ్లిన ఘటన పోలీసులకు సవాల్‌గా మారింది. కేసులో నిందితులను గుర్తించేందుకు నాలుగు బృందాలుగా ఏర్పడి జల్లెడ పడుతున్నారు. వైరా సుందరయ్యనగర్‌కు చెందిన శీలం యుగేందర్‌రెడ్డి ఇంట్లో ఆయన తల్లి వెంకట్రావమ్మ ఒంటరిగా ఉన్న సమయాన సర్వే కోసమంటూ కారులో వచ్చిన నలుగురు ఆమెను కట్టేసి రూ.18 లక్షల విలువైన నగలు ఎత్తుకెళ్లిన విషయం విదితమే. నిందితులు స్విఫ్ట్ డిజైర్ కారులో వచ్చినట్లు సీసీ టీవీ పుటేజీల ఆధారంగా పోలీసులు గుర్తించారు. వైరా ఏసీపీ రెహమాన్, సీఐ ఎన్.సాగర్ నేతృత్వాన నాలుగు బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం గాలిస్తున్నారు.

రెండు గంటల పాటు రెక్కీ

చోరీ పాల్పడిన నిందితులు బుధవారం మధ్యాహ్నం 12నుంచి రెండు గంటల వరకు రెక్కీ నిర్వహించినట్లు తెలుస్తోంది. సోమవరం సమీపంలోని నేషనల్ హైవే కార్యాలయం వద్ద, మధిర రోడ్డులోని ఓ వైన్స్ ఎదురుగా కారులోనే వేచి ఉన్నారని, ఆపై వాసవీ కల్యాణ మండపం రోడ్డు, మహాలక్ష్మి టెంపుల్ రోడ్డులో తిరిగారని సీసీ పుటేజీల ద్వారా గుర్తించారు. చోరీ చేశాక కారు కొణిజర్ల మండలం మీదుగా కోదాడ వైపు వెళ్లినట్లు గుర్తించగా హైవేపై పెట్రోల్‌బంక్‌లు, షాపుల్లో సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నారు. రెండు, మూడు రోజుల్లో నిందితులను గుర్తించే అవకాశముందని తెలుస్తోంది.

వాతలు తేలేలా కొట్టిన ఆయా

ఖమ్మంఅర్బన్: ఆడిస్తూ, లాలిస్తూ పౌష్టికాహారం అందజేయడమే కాక పాఠశాలకు వెళ్లేలా చిన్నారులను సిద్ధం చేయాల్సిన అంగన్‌వాడీ కేంద్రంలో ఓ చిన్నారిని వాతలు పడేలా దండించిన ఘటన ఇది. ఖమ్మం గోపాలపురం అంగన్‌వాడీ సెంటర్ –1కు చిన్నారి ఇరుగు ఖుషిని పంపిస్తుండగా ఆయా ఖాసింబీ గురువారం పచ్చికర్రతో కొట్టినట్లు తెలిసింది. ఇంటికి వెళ్లాక ఖుషి చేతులపై వాతలు ఉండడం, జ్వరం కూడా రావడంతో ఆమె బండ్ల వెంకటనారాయణ ఏమైందని ఆరా తీయగా ఆయా కొట్టినట్లు తేలింది. దీంతో కేంద్రానికి చేరుకుని ఆయాపై మండిపడ్డారు. అధికారులు స్పందించి ఆయా, టీచర్‌పై చర్యలు తీసుకోవాలని కోరాడు.

ఇద్దరిపై అట్రాసిటీ కేసు నమోదు

చింతకాని: బోనకల్ మండలం గోవిందాపురం(ఎల్) గ్రామానికి చెందిన ఉమ్మనేని రమేష్, లగడపాటి సాయిపై చింతకాని పోలీసులు గురువారం అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఒక కేసు విషయంలో విచారణ నిమిత్తం పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన తనపై రమేష్, సాయి పోలీస్‌స్టేషన్ ఆవరణలో కులం పేరుతో దూషిస్తూ దాడి చేశారని బోనకల్‌కు చెందిన ఆర్మీ జవాన్ బూదాల మనోజ్ ఫిర్యాదు చేశాడు. దీంతో వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు. అలాగే మనోజ్ తనను అసభ్య పదజాలంతో దూషించాడని రమేష్ ఇచ్చిన ఫిర్యాదుపైనా కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

రంగరాజన్‌పై దాడి కేసులో నలుగురి అరెస్ట్

తల్లాడ: మొయినాబాద్ మండలం చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడి చేసిన ఘటనలో తల్లాడ మండలానికి చెందిన నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈమేరకు మొయినాబాద్ పోలీసులు గురువారం ఇక్కడకు రాగా తల్లాడ పోలీసుల సహకారంతో నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల్లో తల్లాడ మండలం అంజనాపురానికి చెందిన భూక్యా శ్రీను, అంకోలు శిరీష, వెంకట్రాముని తండాకు చెందిన భూక్యా గోపాల్‌రావు, నారయ్య బంజరకు చందిన బానోత్ బేబీరాణిని పోలీసులు అరెస్ట్ చేసి విచారణ నిమిత్తం తీసుకెళ్లారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

ముదిగొండ: మండలంలోని గంధసిరి, పెద్దమండవ మున్నేరు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు సీజ్ చేశారు. సువర్ణాపురం వద్ద గురువారం చేపట్టిన తనిఖీల్లో హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ శ్రీను ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈమేరకు బాధ్యులపై కేసు నమోదు చేసినట్లు సీఐ మురళి తెలిపారు.

నల్లబెల్లం, పటిక స్వాధీనం

ముదిగొండ: ఏపీలోని అనకాపల్లి నుంచి మహబూబాబాద్ జిల్లా కురవికి తరలిస్తున్న 30కింటాళ్ల నల్లబెల్లం, 12కేజీల పటికను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముదిగొండ మీదుగా గురువారం రాత్రి వాహనంలో నల్లబెల్లం, పటిక తీసుకెళ్తుండగా సీజ్ చేశారు. వాహన యజమాని ఇబ్రాయిల్, డ్రైవర్ అనిల్, బెల్లం వ్యాపారి వెంకట్‌పై కేసు నమోదు చేసినట్లు ముదిగొండ సీఐ మురళి తెలిపారు. తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ ఖలీఖ్, కానిస్టేబుల్ ఉపేందర్ పాల్గొన్నారు.

దంపతుల మృతదేహాలు అప్పగింత

ఖమ్మంక్రైం: ఆర్థిక ఇబ్బందులతో అనారోగ్య సమస్యలకు చికిత్స చేయించుకోలేక ఖమ్మంలో ఈనెల11న ఆత్మహత్య చేసుకున్న నర్సింహారావు–కోటమ్మ మృతదేహాలను గురువారం వారి బంధువులకు అప్పగించారు. ఆత్మహత్య చేసుకున్న ఇద్దరి మృతదేహాలను మార్చురీలో భద్రపర్చిన ఖమ్మం టూటౌన్ పోలీసులు బంధువుల ఆచూకీ కోసం ఆరా తీశారు. ఎట్టకేలకు కోటమ్మ సోదరి వెంకటరమణ ఫోన్‌నంబర్ తెలియడంతో ఆమెకు సమాచారం ఇవ్వడంతో బంధువులతో కలిసి వచ్చింది. దీంతో మృతదేహాలను అప్పగించగా స్వస్థలమైన ఏపీలోని నరసారావుపేట తీసుకెళ్లే పరిస్థితి లేదని తెలిపారు. ఈమేరకు అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు బంధువుల సమక్షాన బల్లేపల్లిలోని శ్మశానవాటికలో నర్సింహారావు దంపతుల అంత్యక్రియలు పూర్తిచేశారు. కాగా, నర్సింహారావు దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నా వారితో సంబంధాలు లేవని కోటమ్మ సోదరి వెల్లడించిందని పేర్కొన్నారు.